నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
3 | మహబూబ్‌నగర్, శుక్రవారం 31 మే 2024 | MAHABUBNAGAR NARAYANPET

## 'వెస్టర్న్'లోకి మార్చడం దురదృష్టకరం..



కాకతీయ తోరణం, తెలంగాణ సింబల్ మార్పు, టీఎస్‌ను టీజీగా మార్చారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని హిందూ సంస్కృతికి దర్పణమైన దేవతామూర్తి రూపంలో కాకుండా మరోలా మార్చాలని.. జయజయహే తెలంగాణ గీతాన్ని కీరవాణి చేత వెస్టర్న్ సంగీతంలోకి మార్చాలన్న ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి రావడం దురదృష్టకరం. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి పౌరుడి ఆకాంక్షే ఈ తెలంగాణ. ఆనాడు కేసీఆర్ ఉద్యమస్ఫూర్తి, ప్రొఫెసర్ జయశంకర్ మేధాశక్తి తెలంగాణ ప్రజలను ఆలోచింపజేసింది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణను సాధించుకున్నాం. గత పదేండ్లల్లో పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేసుకొని వలసలను నివారించినం. బీడుభూములను సాగులోకి తెచ్చి ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణను దేశంలోనే మొదటిస్థానంలో నిలిపి ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది.

*- గుడిపల్లి నర్సింహారెడ్డి, కవి, నాగర్‌కర్నూల్*

## కవులను అవమానించడమే..



తెలంగాణ ఆవిర్భావ వేడుకల వేళ తెలంగాణ కవులు, కళాకారులను రేవంత్ సర్కార్ అవమానించింది. ప్రభుత్వం చర్యలు తెలంగాణ ఉనికిని ప్రమాదంలోకి నెట్టేలా ఉన్నాయి. బీఆర్ఎస్ హయాంలో కవులు, కళాకారులకు స్వర్ణయుగమని చెప్పవచ్చు. నేడు ఆ పరిస్థితి లేదు. అందుకు ఉదాహరణ కీరవాణితో తెలంగాణ రాష్ట్ర గీతానికి స్వరాలు సమకూర్చడమే. మొగులయ్య చెత్తబుట్ట పట్టుకొని పనికి వెళ్లే పరిస్థితిని తీసుకొచ్చింది కూడా ఈ ప్రభుత్వమే. ఇప్పటికైనా తెలంగాణ కవులు, కళాకారులకు గుర్తింపు ఇవ్వడంతోపాటు రాష్ట్రానికి తలమానికమైన చిహ్నాలను తొలగించొద్దు.

*- రాందాసు, కవిరత్న బిరుదు గ్రహీత, కొల్లాపూర్*

## ఇది సరైన నిర్ణయం కాదు..



కేసీఆర్ సర్కారు ప్రవేశపెట్టిన తెలంగాణ లోగోలో కాకతీయ తోరణం, చార్మినార్ చిహ్నాలను కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం మంచి నిర్ణయం కాదు. అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతాన్ని తీసుకోవడం శుభదాయకమే. దానికి కీరవాణి సంగీతం సమకూర్చడం తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నది. ఇక్కడున్న కవులు, కళాకారులు, సంగీత దర్శకులందరినీ అవమానించినట్లే. లోగోలు, గీతాలను మార్చే దానికంటే ప్రజల బతుకులను మార్చడంపై దృష్టి పెడితే బాగుండు. లోగోలను మార్చినంత మాత్రాన ప్రజల బతుకులు మారవు. జనాలకు అవసమైన కనీస సౌకర్యాలు, విద్య, వైద్య, ఆరోగ్య విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించినప్పుడే ప్రజామార్పు సాధ్యమవుతుంది.


*- ఎదిరేపల్లి కాశన్న, కవి, నాగర్‌కర్నూల్*

# మార్పు ఇదేనా?

- తెలంగాణ గేయానికి వెస్టర్న్ బాణీలు!
- 'చిహ్నా'భిన్నం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ కుట్ర
- ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంపై తీవ్ర వ్యతిరేకత
- భగ్గుమంటున్న ఉమ్మడి పాలమూరు జిల్లా
- చారిత్రక గుర్తులు తొలగిస్తే ఉద్యమం తప్పదంటున్న కవులు, కళాకారులు

కవి అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గేయాన్ని కీరవాణి సంగీత దర్శకత్వంలో రికార్డింగ్ చేస్తుండడంతో కవులు, కళాకారుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. రాష్ట్ర గీతానికి వెస్టర్న్ బాణీలు అవసరమా..? అని ప్రశ్నిస్తున్నారు. అలాగే చిహ్నంలోని కాకతీయ కళాతోరణం, చార్మినార్ గుర్తుల తొలగింపునకు రేవంత్ కుట్ర పన్నుతుండడంపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. చారిత్రక గుర్తులు తొలగించడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమన్నారు. 'చిహ్నా'భిన్నం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

*- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మే 30*






# కాల్వలు కడగండ్లు

- వానకాలం ఆరంభమైనా మరమ్మతుల్లేవ్
- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై సర్కారు శీతకన్ను
- సీఎం రేవంత్ సొంత జిల్లాలో పరిస్థితి ఇలా..
- ఖజానాలో చిల్లిగవ్వ లేదంటున్న అధికారులు
- పలు జిల్లాల్లోని కెనాల్స్‌ను కమ్మేసిన చెట్లు
- నీళ్లొదిలితే పూర్తిస్థాయిలో అందడం కష్టమే..
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



జోగుళాంబ గద్వాల జిల్లా బోరవెల్లి వద్ద మొక్కలతో నిండిపోయిన జూరాల-ఆర్డీఎస్ లింక్‌కెనాల్



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని సరస్వతీ ఆలయం వద్ద కాల్వలో ఉన్న రాళ్లు

మహబూబ్‌నగర్, మే 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వానకాలం ప్రారంభమవుతున్నా సాక్షాత్తు సీఎం సొంత జిల్లాలోనే ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌ను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలవుతున్నా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులకు మరమ్మతులు చేయడంలో అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తున్నది. రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువుదీరడం.. ఇరిగేషన్ శాఖకు ఇవ్వాల్సిన నిధులు అందకపోవడంతో అధికారులు మరమ్మతులు చేయలేక చేతులెత్తేశారు. ఫలితంగా జిల్లాలోని అనేక ప్రధాన ప్రాజెక్టుల కాల్వలు రిపేర్లు లేక అధ్వానంగా మారాయి. పాలమూరు వరప్రదాయిని అయిన జూరాల ప్రాజెక్టుకు ఏటా మెయింటెనెన్స్ చేపట్టేవారు. చిన్నచిన్న రిపేర్లన్నీ చేసి వర్షాకాలంలో ప్రాజెక్టు నిండాక గేట్లు ఎత్తి కాల్వలకు నీళ్లు సరఫరా చేసేవారు. ఇదంతా ఎండాకాలంలోనే జరిగేది. ప్రతి యేటా యాసంగి ప్రారంభం నుంచి ఫిబ్రవరి వరకు ప్రాజెక్టుల్లో ఉన్న నీటిని కాల్వల ద్వారా తరలిస్తారు. మార్చి తర్వాత అన్ని ప్రాజెక్టులు మెయింటెనెన్స్‌లోకి వెళ్లిపోయేవి. ఈసారి కొత్త ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మరమ్మతులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉమ్మడి జిల్లాలోని కృష్ణానది బేసిన్‌లో జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల కింద లక్ష ఎకరాలు, సమాంతర కెనాల్ కింద 50 వేల ఎకరాలు, భీమా మొదటి రెండు కాల్వల కింద రెండులక్షల ఎకరాలు.. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా మూడులక్షల ఎకరాలు.. కోయిల్‌సాగర్ పథకం ద్వారా 50వేల ఎకరాలు.. నెట్టెంపాడు కింద లక్ష ఎకరాలు సాగవుతాయి. అలాగే తుంగభద్రా నది కింద ఆర్డీఎస్ ప్రధాన కాల్వతో పాటు సుంకేసుల బ్యారేజ్ నుంచి సుమారు లక్ష ఎకరాల వరకు సాగవుతుంది. ప్రతి ఏడాది ఈ ప్రాజెక్టుల కింద కాల్వలకు మరమ్మతులు, జంగిల్ కటింగ్, తూముల నిర్వహణ, ఇతర మైనర్ పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈసారి అవేవీ జరుగడం లేదు.

### సీఎం జిల్లాలో మరమ్మతులు నిల్..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రధాన ప్రాజెక్టుల కింద 8లక్షల ఎకరాలకు పైగా సాగవుతాయి. ఈ జిల్లాలో కృష్ణా, తుంగభద్రా నదులు ప్రవహిస్తాయి. ఈ రెండు నదుల కింద వివిధ ప్రాజెక్టుల ద్వారా రైతులకు సాగునీటిని అందిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక ఈ రెండు నదులపై ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంతోపాటు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడంతో ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతోపాటు ప్రతి ఏటా ఈ ప్రాజెక్టుల నిర్వహణకు ప్రభుత్వం ముందుగానే బడ్జెట్లో నిధులు కేటాయించింది. ఈసారి అధికారం మారడంతో ఉమ్మడి జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి సీఎం కాగా.. ప్రాజెక్టుల రూపురేఖలు మారుతాయని అన్నదాతలు ఆశించారు. కానీ ఇందుకు విరుద్ధంగా ఏడాదికోసారి నిర్వహించాల్సిన మరమ్మతులే నిలిచిపోవడం గమనార్హం. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతోనే మరమ్మతులు నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు.



నాగర్‌కర్నూల్ జిల్లా దేశిటిక్యాల-వనపట్ల మధ్య ఎంజీకేఎల్‌ఐ కాల్వలో పేరుకుపోయిన చెట్లు

### ముంచుకొస్తున్న వానకాలం..

వానకాలం మరో వారం రోజుల్లో ప్రారంభమవుతుంది. జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు తెలంగాణకు వచ్చే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేస్తున్నది. దీంతో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నది. వర్షాలు మొదలైతే ఈ రెండు నదుల్లో నీటిమట్టాలు క్రమంగా పెరుగుతాయి. గతంలో వచ్చిన వరదను వచ్చినట్లుగా ఆయా ప్రాజెక్టులకు మళ్లించి రిజర్వాయర్లలో నిల్వ చేసేవారు. ఈసారి ప్రధాన కాల్వలతో పాటు రిజర్వాయర్ల నుంచి వెళ్లే కాల్వలన్నీ అధ్వానంగా మారాయి. అందుకు తోడుగా ఈ ఎండాకాలం రిపేర్లు చేయకపోవడంతో కాల్వలకు గండ్లు పడే అవకాశం ఉందని రైతాంగం ఆందోళన చెందుతున్నది. నీటి ప్రవాహం తగ్గి రిజర్వాయర్లు నిండవని.. ఫలితంగా కాల్వలపై ఆధారపడిన వేలాదిమంది రైతులు గోసపడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే నిజమైతే సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతుంది. ఇప్పటికే గత యాసంగిలో రైతులు చాలా నష్టపోయారు. కృష్ణానదిలో నీటి నిల్వలు ఉన్నా పక్కనున్న ఆంధ్ర రాష్ట్రానికి భయపడి రేవంత్ సర్కార్ ఈ ఆరు నెలల్లో చుక్క నీటిని కూడా ఉమ్మడి జిల్లాకు తరలించలేదు. కనీసం తాగునీటికి కూడా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని వాడుకునే సాహసం చేయలేదు. ఫలితంగా సాగు, తాగునీటి ఎద్దడి నెలకొన్నది. వర్షాకాలం సమీపిస్తున్నా ప్రాజెక్టులు రిపేర్లకు నోచుకోకపోవడం, కాల్వలు అధ్వాన స్థితికి చేరడంతో సాగునీటి ఎద్దడి తప్పదని ఇంజినీర్లు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సొంత జిల్లాపై సీఎం సవతి ప్రేమ చూపకుండా ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# నకిలీపై నజర్ ఉంచాలి

- మండలానికో టాస్క్‌ఫోర్స్ బృందం
- అధికారులు విస్తృతంగా పర్యటించాలి
- నాణ్యత లేని విత్తనాలమ్మితే పీడీ యాక్ట్
- రంగు ప్యాకెట్లను చూసి మోసపోవద్దు..
- నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 30 : జిల్లాలో వానకాలం సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో నకిలీ విత్తన వ్యాపారాలపై అధికారులు పటిష్ట నిఘా పెట్టాలని వ్యవసాయ, పోలీస్ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలను కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉదయ్‌కుమార్ అధ్యక్షతన వ్యవసాయ, పోలీస్‌శాఖలతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాల అధికారులతో నకిలీ విత్తనాలు, ఎరువులపై తీసుకోవాల్సిన చర్యలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వానకాలంలో 4.59 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని, అత్యధికంగా 2,73,720 ఎకరాల్లో పత్తి, 1,40,082 ఎకరాల్లో వరి, 45,237 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగు చేస్తారన్నారు. జిల్లావ్యాప్తంగా 663 విత్తన విక్రయ కేంద్రాలున్నాయని.. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టడానికి మండలానికో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. పోలీస్, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ సభ్యులు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో సోదాలు చేయాలని, నాసిరకం విత్తనాలు అమ్మేవారిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. వ్యాపారులు నకిలీ, నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తారని, వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అనుమతి లేని, బీటీ-3, నకిలీ విత్తనాలను వ్యాపారులు మార్కెటింగ్ చేయడానికి ప్రయత్నిస్తుంటారని.. వాటి వల్ల దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందన్నారు. దీనిని అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. సీడ్ సప్లయింగ్ ధ్రువీకరణ పత్రాలు, ఎరువులు, దుకాణాల లైసెన్స్‌లు, స్టాక్‌ను బృందాలు క్షుణ్ణంగా పరిశీలించాలని.. రోజువారీ విక్రయాలను కూడా తనిఖీ చేయాలన్నారు. రసీదులపై ఏఈవోలు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. నకిలీల బారిన పడకుండా అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. లైసెన్స్‌లు పొందిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేయాలని, డీలర్ల సంతకంతో కూడిన రసీదును తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన తేదీ, విత్తనాల రకం, పరిమాణం, ధర, లాట్ నెంబర్ తదితర వివరాలను రసీదులో నమోదు చేయించుకొని పంట చేతికొచ్చే వరకు భద్రపర్చుకోవాలన్నారు. రంగు ప్యాకెట్లను చూసి మోసపోవద్దని, కంపెనీ విశ్వసనీయత, విత్తనాల నాణ్యత, మొలక శాతాన్ని పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. బిల్లులు లేకుండా తక్కువ ధరలకు విత్తనాలు అమ్మే వారిపై ప్రత్యేక దృష్టి ఉంచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కుమార్‌దీపక్, సీతారామారావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రశేఖర్, డీఎస్పీ శ్రీనివాసులు, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- ప్రతి దుకాణంలో విత్తనాలు, ఎరువుల స్టాక్ బోర్డు ప్రదర్శించాలి
- జూన్ 15 వరకు షాపుల్లో తనిఖీలు చేయాలి
- జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, మే 30 : జిల్లాలో ఎరువులు, విత్తనాల కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ప్రతి దుకాణంలో డీలర్లు తప్పనిసరిగా స్టాక్ బోర్డు, అమ్మకం వివరాలు విధిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాక్ బోర్డులో సూచించిన మేరకు దుకాణంలో స్టాక్ ఉందో లేదో తనిఖీ చేయాలన్నారు. డీలర్లు ఎమ్మార్పీ ధరలకే విత్తనాలను విక్రయించాలని, నకిలీవి అమ్మేవారిపై నిఘా ఉంచాలన్నారు. నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయించే డీలర్లపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని సూచించారు. నిబంధనలు పాటించని డీలర్లపై చర్యలు తీసుకుంటేనే మిగతా వారు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయిస్తారని తెలిపారు. జూన్ 15వరకు వ్యవసాయశాఖ అధికారులు రోజుకు నాలుగైదు దుకాణాలను తనిఖీ చేస్తూ రైతులకు విత్తనాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. కొరత ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అవసరం మేరకు స్టాక్ తెప్పించి రైతులకు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఏవో గోవిందునాయక్, ఏవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

# భారీగా గుట్కా పట్టివేత

- స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాగర్‌కర్నూల్, మే 30 : నాగర్‌కర్నూల్‌లోని పాత వ్యవసాయ మార్కెట్‌లో భారీగా నిల్వ ఉంచిన నిషేధిత గుట్కాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన సంతోష్ పాత మార్కెట్‌లోని ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకొని అందులో పెద్ద మొత్తంలో గుట్కాలను నిల్వ ఉంచాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు, సీసీఎస్ పోలీసులతో కలిసి దుకాణంలోని దాదాపు రూ.10లక్షల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీసీఎస్ సీఐ శంకర్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

# బాత్రూంలో ప్రసవం

- సరైన వైద్యం అందక పసికందు మృతి!
- కందనూలు జిల్లా దవాఖానలో ఘటన

నాగర్‌కర్నూల్, మే 30 : సరైన వైద్యం అందక నవజాత శిశువు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు.. తాడూరు మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన మహేశ్వరి(28) కాన్పు కోసం బుధవారం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. ఈక్రమంలో నొప్పులు ఎక్కువవడంతో గర్భిణి బాత్‌రూంలోనే ప్రసవించగా శిశువు మృతి చెందింది. కాగా సరైన వైద్యం అందించకపోవడంతోనే శిశువు మృతిచెందినట్లు బాలింత భర్త ఆంజనేయులు ఆరోపించాడు. మూడో కాన్పుకోసం దవాఖానకు వస్తే పట్టించుకోకపోవడంతో బాత్‌రూమ్‌లోనే ప్రసవించిందని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బిడ్డ మృతి చెందిందని బాధితుడు వాపోయాడు. సూపరింటెండెంట్ రఘును వివరణ కోరగా వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదని, సరైన సమయంలోనే వైద్యం అందించారని తెలిపారు. 8నెలల 15 రోజులకే డెలివరీ, శిశువు బరువు తక్కువ ఉండడమే మరణానికి కారణమన్నారు.